ప్రజాశక్తి
శుక్రవారం 30 మే 2025
5
శ్రీ సత్యసాయి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

రోజువారీ పని ఒత్తిడి నేపథ్యంలో జనం కాస్త ఉపశమనం పొందే వాటిలో సినిమాలు ఒకటి. రెండున్నర గంటల పాటు తమ ఒత్తిడిని దూరం చేసుకుని ప్రశాంతంగా ఉండేందుకు సినిమాను ప్రేక్షకలు ఎంచుకుంటారు. కుటుంబంతో సరదాగా గడిపేందుకు సినిమా ఉపయోగపడుతోంది. అలాంటి సినిమా ఇప్పుడు వ్యాపారం అయ్యింది. మల్టీప్లెక్స్ సినిమాల రాకతో థియేటర్ల స్వరూపమే మారిపోయింది. అధిక ధరలతో ప్రేక్షకుడిని నిట్టనిలువునా దోపిడీ చేస్తున్నారు. టికెట్ ధర నుంచి తినుబండారు వరకు అన్నింటి ధరనూ రెండు, మూడింతలు పెంచి ప్రేక్షకుడికి 'సినిమా' చూపిస్తూ మల్టి'ఫుల్'గా దోపిడీ చేస్తున్నారు.



మల్టి 'ఫుల్' దోపిడీ..!

- సినిమా థియేటర్లలో ధరాభారాలు
- టికెట్‌తో పాటు తినుబండారాలన్నీ అధికమే
- పండుగపూట మరింత దోపిడీ
- కుటుంబంతో సినిమాకు వెళ్తే రూ.2వేలు ఖర్చు చేయాల్సిందే..
- సగటు ప్రేక్షకుడి జేబుకు చిల్లులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న తనిఖీలు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని పట్టణ ప్రాంతాల్లో మల్టీప్లెక్స్ థియేటర్లు ఉన్నాయి. అనంతపురం, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుకొండ ప్రాంతాల్లో మల్టీప్లెక్స్ థియేటర్లు ఉన్నాయి. గత దశాబ్దం క్రితం వరకు సాధారణ థియేటర్లుగా ఉన్న వాటిని కార్పొరేట్ వ్యక్తులు లీజుకు తీసుకుని వాటిని మల్టీ ప్లెక్స్‌లుగా మార్చేశారు. థియేటర్‌కు అందమైన రంగులు అద్ది కార్పొరేట్ హంగును తీసుకుని వచ్చారు. థియేటర్లు కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా దాని స్వరూపమే మారిపోయింది. ముఖ్యంగా అందులో ప్రదర్శించే సినిమా టికెట్ల ధర, అక్కడ అమ్మే తినుబండారాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నలుగురు కుటుంబ సభ్యులున్న వారు సినిమాకు వెళ్లాలంటే రూ.1500 నుంచి రూ.2000 వరకు వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్ద హీరోలు నటించిన సినిమాలు విడుదలైన మొదటి వారం వరకు టికెట్ ధర రూ.600 వరకు నడుస్తోంది. సినిమా బాగుందని ప్రచారంలో వస్తే ఈ ధరను మరింత పెంచుతున్నారు. రెండు, మూడు రోజుల్లోనే సినిమా నిర్మాణానికి పెట్టిన పెట్టుబడులు మొత్తం రాబట్టుకునేలా ధరలను పెంచేస్తున్నారు. థియేటర్లలో తినుబండారాలు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బయట దొరికే వస్తువులనే మల్టీప్లెక్స్‌లో నాలుగింతల ధర పెంచి అమ్ముతున్నారు. బయట రూ.10కి దొరికే పాప్‌కార్న్‌ను రూ.50 నుంచి రూ.100, రూ.10 కూల్‌డ్రింక్‌ను రూ.50, రూ.10 విలువజేసే సమోసా రూ.40, రూ.20 వాటర్‌బాటిల్ రూ.40 ఇలా అన్నింటి ధరలను పెంచి ప్రేక్షకుడి నడ్డివిరుస్తున్నారు. సినిమా హాల్లో ద్విచక్రవాహనం నిలపాలంటే రూ.20, కారు నిలపాలంటే రూ.50 వసూలు చేస్తున్నారు.

పండుగ వస్తే మరీ అధికం

పండుగ సీజన్‌లో సాధారణంగా కొత్త సినిమాలు ఎక్కువగా విడుదల అవుతుంటాయి. ఈ సమయంలో ప్రజలకు సెలవులు ఉండడంతో చాలా మంది సినిమాను చూసేందుకు ఇష్టపడతారు. దీనిని అదునుగా చేసుకుని మల్టీప్లెక్స్ నిర్వాహకులు ధరలను పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఆ రోజుల్లో సినిమా టికెట్ ధరలను అమాంతం పెంచేస్తున్నారు.

సౌకర్యాలు నిల్

మల్టీప్లెక్స్ యాజమాన్యాలు ప్రేక్షకుల నుంచి ముక్కుపిండి ధరలు వసూలు చేస్తున్నా వసతులు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. థియేటర్ల మరుగుదొడ్లలో కనీస శుభ్రత పాటించడం లేదు. నీటి వసతి అంతంతమాత్రంగానే ఉంటోంది. వారానికి ఒకసారి కూడా మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న దాఖలాలు లేవు. ఇక పార్కింగ్ రుసుం రూ.20 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నా వాహనాలు నిలిపేందుకు నీడను ఏర్పాటు చేయడం లేదు. సినిమా థియేటర్లకు ఆనుకుని ఆరుబయట ఎండకే వాహనాలను నిలపాల్సిన పరిస్థితి ఉంది.

సినిమా థియేటర్లలో తనిఖీలు

సినిమా థియేటర్లలో జరుగుతున్న అధిక ధరలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బుధ, గురువారాల్లో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేసి వాస్తవాలను గుర్తించారు. తహశీల్దార్లు, ఆర్డీవోలు స్వయంగా సినిమా థియేటర్లలోకి వెళ్లి పరిశీలన చేశారు. టికెట్, తినుబండారాల ధరలను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, ఆహార వస్తువుల నాణ్యత గురించి తెలుసుకున్నారు. చాలా థియేటర్లలో సౌకర్యాలు లేవని, నాణ్యత ప్రమాణాలు పాటించలేదని గుర్తించారు. నిబంధనలు పాటించని థియేటర్ల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తినుబండారాల ధరల వివరాలను ఖచ్చితంగా బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే సినిమా థియేటర్ల నిర్వహణ కొనసాగాలని ఆదేశించారు.

హిందూపురంలోని థియేటర్లలో తినుబండారాల ధరలు, మరుగుదొడ్లలో శుభ్రతను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పూర్తిస్థాయిలో ఆయుష్మాన్ భారత్ అమలు

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పిఎంజెఎవై స్కీం (ఆయుష్మాన్ భారత్ యోజన)ను జిల్లాలో పటిష్టంగా అమలు చేసి, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులూ రాకుండా చూసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో డా॥ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా అమలు యూనిట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య సేవ కోఆర్డినేటర్ శ్రీదేవి, జిల్లా వైద్య అధికారి ఫిరోజ్ బేగం, హిందూపురం డిసిహెచ్ఒ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వైద్య అధికారి ఆధ్వర్యంలో వారం వారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్య సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించాలన్నారు. ఈ పథకం వల్ల కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని చెప్పారు. కార్మికులకు ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. హిందూపురం బాలాజీ ఆసుపత్రి, స్పందన ఆసుపత్రి, రాఘవేంద్ర తేజ ఆసుపత్రుల్లో ఆయుష్మాన్ భారత్ పనితీరును కలెక్టర్ సమీక్షించారు. కదిరి ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్య అధికారులు పాల్గొన్నారు.

చెరువు మట్టి తరలింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బత్తలపల్లి

చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పోట్లమర్రి గ్రామస్తులు తహశీల్దార్ స్వర్ణలతకు వినతి పత్రం అందజేశారు. ఆ గ్రామ రైతులు విలేకరులతో మాట్లాడుతూ గతంలో చెరువు మట్టిని వేల్పుమడుగు వద్ద ఉన్న పెళ్లల ఫ్యాక్టరీకి తరలించే విషయంలో గ్రామపెద్దలు ఆంజనేయస్వామి ఆలయానికి కొంత మొత్తం అందించేలా ఒప్పందం చేసుకున్నారన్నారు. అయితే చెరువు మట్టిని అలా తరలిస్తే రైతులకు సారవంతమైన మట్టి లభించదని అభ్యంతరం తెలపడంతో మట్టి తరలించే విషయంలో వెనక్కి తగ్గారన్నారు. ఆ తరువాత చెరువు మట్టిని గ్రామంలోని రైతులు పొలాలకు మాత్రమే తరలించాలని, ఇతరత్రా గ్రామాల వారు, డబ్బులకు అమ్మవద్దని నిర్ణయించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక టిడిపి నేత దేవరకొండ రామకృష్ణ రేయింబవళ్లు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అభ్యంతరం చెబితే తనకు ఇన్ని అనుమతులు ఉన్నాయంటూ దౌర్జన్యం చేస్తున్నట్లు తెలిపారు. చెరువు మట్టిని అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవాలని, చెరువును పరిరక్షించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు దామోదర్‌రెడ్డి, రమణారెడ్డి, నాగేంద్రరెడ్డి, శివయ్య, అనంతరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరేష్‌రెడ్డి, మాధవరెడ్డి, నరసింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు. కాగా రామకృష్ణ మాట్లాడుతూ తన పొలానికి మాత్రమే మట్టిని తరలిస్తున్నానని అమ్ముకోలేదని తెలిపారు.

తహశీల్దార్ స్వర్ణలతకు వినతి పత్రం ఇస్తున్న పోట్లమర్రి గ్రామ రైతులు

మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు గురువారం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో శక్తి బృందాలు రద్దీ ప్రదేశాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, తదితర ముఖ్యమైన ప్రదేశాల్లో మహిళలు, బాలికలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు. మహిళల భద్రత, రక్షణ కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ ఆవశ్యకత, దాని ద్వారా అందించే సేవలు, నిక్షిప్తం చేయబడిన సమాచారం, రిజిస్ట్రేషన్ చేసుకొనే విధానం, తదితర విషయాల గురించి విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు. శక్తి వాట్సాప్ నెంబర్ 79934 85111 గురించి వివరించారు. ఆపదలో ఉన్న మహిళలు శక్తి వాట్సాప్ నెంబరుకు వీడియో కాల్ (లేదా) నార్మల్ కాల్ (లేదా) మేసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సంకేతాలు వెళ్తాయన్నారు. దీంతో వెంటనే శక్తి బృందాలు స్పందించి ఆపదలో ఉన్న మహిళలకు సాయం అందిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ వాట్సాప్ నంబర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

లింగ వివక్ష, క్షయపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి పిహెచ్‌సి వైద్య సిబ్బంది గురువారం బ్రాహ్మణపల్లి గ్రామంలో లింగ వివక్ష, క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సామజిక ఆరోగ్య అధికారి నగేష్, డిటిసి సూపర్వైజర్ అబిద్‌బాషా లింగ వివక్ష, క్షయ వ్యాధిపై అవగాహన, భేటీ బచావో-భేటీ పడావో, లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని వివరించారు. గర్భధారణ తర్వాత లింగ నిర్ధారణను నిషేధించడానికి పిసిపిఎన్‌డి చట్టం ఉందని, భ్రూణ హత్యలను నియంత్రించడానికి ఇది అవసరమన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తారన్నారు. ఆడపిల్లను పుట్టనిద్దం, వారికి భద్రత కల్పించి స్వేచ్ఛా జీవితం అందించాలని పిలుపునిచ్చారు. క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయరాదని, ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గుతో పాటు గళ్ల పడడం, ఛాతిలో నొప్పి, ఉదయం, సాయంత్రం జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించం, తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య సదుపాయం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సుపర్వైజర్ వెంకటరమణ, ఆరోగ్య కార్యకర్త అనురాధ, రాజేశ్వరి, ఆశా కార్యకర్త గులాబ్ జాన్, లింక్ వర్కర్ శిల్ప పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులతో చర్చలు సఫలం

చర్చలు జరుపుతున్న అధికారులు

ప్రజాశక్తి-గాండ్లపెంట

పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాల విషయమై గురువారం అధికారులతో జరిపిన చర్చలు సఫలమైనట్లు సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, రైతు సంఘం నాయకుడు కెకె.రాజారెడ్డి తెలి పారు. బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక బస్సు స్టాప్ వద్ద 8 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. తొమ్మిదవ రోజైన గురువారం స్థానిక ఎంపిడీవో కార్యాలయంలో డిఎల్‌పిఒ అంజనప్ప, ఈవోఆర్డీ సునీత, పంచాయతీ కార్యదర్శి కలిసి సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, రైతు సంఘం నాయకుడు కెకె.రాజారెడ్డి పారిశుద్ధ కార్మికులతో చర్చలు జరిపారు. డిఎల్‌పిఒ మాట్లాడుతూ గ్రాంట్ విడుదలైన వెంటనే గ్రామ పంచాయతీల వారీగా పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్లౌజులు, శానిటైజర్ కిట్లు చెల్లిస్తామన్నారు. శనివారం నుంచి పారిశుధ్య కార్మికులు విధులకు హాజరు కావాలని తెలిపారు. సమావేశంలో పారిశుధ్య కార్మికులు అక్కులప్ప, అంజి, నరసింహులు, బాలకృష్ణ, రమణమ్మ, కదిరప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిటి సంస్థను కాపాడుకుందాం

తలుపులలో ర్యాలీ

ప్రజాశక్తి-తలుపుల

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్‌డిటి)ను కాపాడుకుందామని కోరుతూ గురువారం తలుపులలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రజలు 'ఆర్‌డిటిని కాపాడుకుందాం' అనే బ్యానర్ పట్టుకుని స్థానిక ప్రభుత్వ హైస్కూల్ నుంచి పట్టణ ప్రధాన రహదారి గుండా బస్టాండ్, మూడు రోడ్ల కూడలికి చేరుకున్నారు. అక్కడ ఆర్‌డిటిని రక్షించండి పేదల అభ్యున్నతిని పునరుద్ధరించండి అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వెళ్లి తహశీల్దార్ రెడ్డి శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఒబిఆర్ తండాకు చెందిన ఫణీంద్రనాయక్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఆర్‌డిటి ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. మహిళా అభ్యున్నతికి, నిరుపేదల ఉన్నత విద్యాభ్యాసానికి కృషి చేస్తుందన్నారు. ఉచితంగా విద్య, వైద్యం అందిస్తుందన్నారు. అలాంటి సంస్థకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలతో సమానంగా ప్రజలకు ఆర్డీటీ అనేక రకాలుగా సేవలు అందిస్తోందన్నారు. ఇలాంటి సంస్థకు ప్రోత్సాహం అందించి మరింతగా ప్రజలకు సేవలు అందించేలా బాసటగా నిలవాలని కోరారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆర్‌డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎ(ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరత్నం, శ్రీనివాసులు, ఫణీంద్రనాయక్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి మద్దతుగా తలుపులలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

'ప్రస్తుత రాజకీయాలు-సిపిఎం వైఖరి' అన్న అంశంపై ప్రసంగిస్తున్న వి.రాంభూపాల్

సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తితో సమస్యల పరిష్కారంపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సిపిఎం అనంతపురం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ప్రజాశక్తి కాలనీలో 'ప్రస్తుత రాజకీయాలు-సిపిఎం వైఖరి' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. సిపిఎం నాయకులు ముత్తుజా అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ విశాలాంధ్రలో ప్రజారాజ్యం రావాలని, కులవివక్ష, అంటరానితనం పోవాలని, దున్నే వాడికే భూమి కావాలని, వ్యవసాయ కూలీలకు కూలి పెంచాలని, కార్మికులకు హక్కులు ఉండాలని నినాదాలతో పోరు సాగించారన్నారు. ఉద్యమాలకు ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించారన్నారు. పార్లమెంట్ సభ్యునిగా తన జీవిత కాలంలో ప్రజా ప్రతినిధిగా ఎలా ఉండాలో ఆచరణలో చూపిన వ్యక్తి అన్నారు. పార్లమెంట్‌కు సైకిల్‌లో వెళ్లిన గొప్ప రాజకీయ వేత్త సుందరయ్య అన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపైన వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా సుందరయ్య పోరాట స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేసేలా పోరు సాగించాలన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసేలా పాలకులపై ఒత్తిడి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, వార్డు సభ్యురాలు ఆదెమ్మ, నగర కార్యదర్శివర్గ సభ్యులు, గోపాల్, ప్రకాష్, ఇర్ఫాన్, వలి, నగర కమిటీ సభ్యులు, బుల్లె రాజు, వెంకటేష్, ఎన్టీఆర్ శ్రీనివాసులు, బాలు, జీవ, లతీఫ్, ప్రజాశక్తి నగర్ శాఖ సభ్యులు పాల్గొన్నారు.

అహుడా ల్యాండ్ బ్యాంక్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం

స్థల పరిశీలన చేస్తున్న జాయింట్ కలెక్టర్

అహుడ ల్యాండ్ బ్యాంక్ కోసం స్థలాలను జాయింట్ కలెక్టర్, అహుడ వైస్ ఛైర్పర్సన్ శివ్ నారాయణ్ శర్మ గురువారం పరిశీలించారు. అనంతపురం నగరంలోని కొవ్వూరు నగర్ కోఆపరేటివ్ సొసైటీ స్థలం, కోర్టు రోడ్‌లోని ప్రభుత్వ ఐటిఐ స్థలం, గుత్తి రోడ్డులో తడకలేరు బ్రిడ్జిని ఆనుకుని ఉన్న 7 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

మెప్మా, గ్రంథాలయం పరిధిలో బదిలీల ప్రక్రియ

ప్రజాశక్తి-అనంతపురం



బదిలీల ప్రక్రియను నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో మెప్మా, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, సిబ్బందికి బదిలీల కౌన్సిలింగ్‌ను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా మెప్మాకు సంబంధించిన ఉద్యోగుల బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థలో జిల్లాలోని గ్రంథాలయ సిబ్బంది సాధారణ బదిలీల కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. లైబ్రేరియన్ గ్రేడ్ 3, రికార్డ్ అసిస్టెంట్,కార్యాలయ సహాయకుల బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



జగన్‌ను కలిసిన శ్రీనివాసులు, ఉషశ్రీచరణ్

జగన్‌ను కలిసిన పుల్లేరు ఉపసర్పంచి

ప్రజాశక్తి-గోరంట్ల

వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్‌ను గురువారం తాడేపల్లిలో మండలంలోని పుల్లేరు పంచాయతీ ఉప సర్పంచి శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో జగన్‌ను కలవడం సంతోషంగా ఉందని శ్రీనివాసులు తెలిపారు.

రేపు ధర్మవరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఈ నెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ జి.రాజేశ్వరిబాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చించి, కౌన్సిలర్ల ఆమోదం కోరతారన్నారు. అలాగే పట్టణంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. కావున కౌన్సిలర్లు, వైస్ ఛైర్మన్లు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యా వ్యాపారం షురూ..!

యథేచ్ఛగా ప్రయివేటు విద్యా సంస్థల దోపిడీ
సుపర్ మార్కెట్ తరహాలో కార్పొరేట్ విద్యా సంస్థలు
అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు
పాఠశాల ప్రాంగణంలోనే స్టోర్లు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల విద్యా వ్యాపారం మొదలైంది. ఇప్పటికే ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం తదితర వాటికి తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలి కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి. అడ్మిషన్ ఫీజులు, పుస్తకాలు, అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి.

ప్రతి ఏటా ఫీజుల మోత

ప్రతి విద్యా సంవత్సరం కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రతి తరగతికి ఫీజులను పెంచుతున్నారు. ఎల్‌కెజి విద్యకు రూ.20వేలు అయితే రెండవ సంవత్సరం ఎల్‌కెజి వచ్చే సరికి ఈ ఫీజులో 20 నుంచి 30 శాతం పెంచేస్తున్నారు. ఏమని అడిగితే మార్కెట్‌లో అన్ని ధరలూ పెరిగిపోతున్నాయని దీంతో పెంచుతున్నామని సెలవిస్తున్నారు. 10వ తరగతి చదివించడానికి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థ ముందు తాము వసూలు చేసే ఫీజుల వివరాలు, రవాణా ఛార్జీలు డిస్ ప్లే బోర్డులో పెట్టాల్సి ఉంటుంది. జిల్లాలోని ఏ ప్రయివేటు విద్యా సంస్థ ముందు ఇలాంటి బోర్డులేవీ కనిపించవు. స్టేషనరీ పేరుతో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు లక్షల రూపాయల్లో దండుకుంటున్నాయి. పాఠశాలల్లోనే ఇష్టానుసారం పుస్తకాలు, యూనిఫామ్ ఇతర స్టేషనరీని విక్రయిస్తున్నారు.

సదుపాయాలు లేకుండా అనుమతులు

ప్రయివేటు విద్యా సంస్థను స్థాపించాలంటే ప్రభుత్వం నిబంధనలు అనేకం ఉన్నాయి. ఈ నిబంధనలను జిల్లాలో ఎక్కడా ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యం అమలు చేయడం లేదు. హిందూపురం పట్టణంలో నారాయణ, చైతన్య, చైతన్య ఈ టెక్నో మూడు కార్పొరేట్ విద్యా సంస్థలు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క విద్యా సంస్థ కూడా నిబంధనలు పాటిస్తున్న దాఖలు లేవు. విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి కాసింత మైదానం కూడా లేదు. జీవో ఎంఎస్ నెంబర్ ఒకటి ప్రకారం పాఠశాల తల్లిదండ్రుల కమిటీని ఏర్పాటు చేసి ఫీజులు నిర్ణయించాల్సి ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. వీటన్నింటిపైన విద్యా శాఖ అధికారుల పరిశీలన, స్పందన నామమాత్రంగానే ఉంది.

కార్పొరేట్ పాఠశాలలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి

విద్యను వ్యాపారం చేసి విద్యార్థులను పుస్తకాల పురుగులను చేసి వారి మరణాలకు కారణమవుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడిస్తాం. నిబంధనలు పాటించని, ఫీజుల పేరుతో, పుస్తకాల నుంచి యూనిఫాం పేరుతో దోపిడీకి పాల్పడుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి.

ఈరేష్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎపి రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, జెవి. రమణ, ఎస్‌హెచ్.బాషా ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై ఆర్‌డిఒ కార్యాలయంలో అధికారిణికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విత్తనం వేసే సమయం వచ్చినా జిల్లా వ్యాప్తంగా రైతులకు ఇప్పటికీ విత్తనాలు ఇవ్వలేద న్నారు. ఎకరాకు 3 ప్యాకెట్ల చొప్పున ఐదెకరాలున్న రైతులకు 15 ప్యాకెట్ల విత్తన వేరుశెనగ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అంతర పంటలైన అలసంద, పెసులు, ఆముదం, తదితర విత్తనాలను కూడా రైతులకు సరఫరా చేయాలని కోరారు. ప్రధానంగా పంటలకు వేసే మందులు, ఎరువులను ప్రభుత్వం సబ్సిడీ ధరపై అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు ఆలకుంట మారుతి, సిపిఎం నాయకులు వెంకటస్వామి, సిఐటియు నాయకులు ఎల్.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

హైవే పనులను అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

జాతీయ రహదారి-342 విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని రైతులు స్పష్టం చేశారు. జాతీయ రహదారి-342లో భాగంగా ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వరకూ నూతనంగా నిర్మాణం చేపట్టిన రోడ్డు పనులను ముదిగుబ్బలో నాల్గో రోజైన గురువారం కూడా భూనిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ నారాయణస్వామి ఫోన్ చేసి సోమల ప్రకాష్‌నాయుడు, రైతులను పిలిపించి మాట్లాడారు. మీకు అందాల్సిన నష్టపరిహారం విషయాన్ని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పినా రైతులు ససేమిరా అన్నారు. నష్టపరిహారం చెల్లించే వరకూ పనులు చేయనీయమని తెగేసి చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సోమల ప్రకాష్‌నాయుడు, సనత్‌కుమార్, విశ్వనాథ్, ప్రభాకర్‌నాయుడు, టీవీ రమణ, రాగినాయుడు, హనుమంతు, రఘుశాస్త్రి, నాయుడు, మునికుమార్, యంగమనాయుడు, పుల్లప్ప, రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న నాయకులు, రైతులు

ప్రభుత్వ భూములు గుర్తించండి

డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలో ప్రభుత్వ భూములను త్వరగా గుర్తించాలని జిల్లా డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ తెలిపారు. భూసేకరణపై గురువారం ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విఆర్వోలు, సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రభుత్వ భూములను గుర్తించి నివేదికలు అందించాలని ఆదేశించారు. సోలార్ నిర్మాణానికి సమీపంలోని ప్రయివేటు భూములకు ఎకరాకు రూ. 31 వేలు లీజు పద్ధతిలో భూసేకరణకు ప్రభుత్వం ప్రతిపాదించిందని, ఆ భూములు రైతుల పేరిటే ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ దేవేంద్రనాయక్, ఆర్ఐ శ్రీధర్, విఆర్వోలు రఘు, నాగరాణి, దీపిక, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు. అనంతరం ఆయన తిమ్మమ్మ మర్రిమానును సందర్శించారు.

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గౌతమ్‌తో క్లబ్ సభ్యులు

లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పేద ప్రజలకు లయన్స్ క్లబ్ ద్వారా మరిన్ని సేవలు అందించాలని, తద్వారా లయన్స్ క్లబ్ మంచి గుర్తింపు పొందే అవకాశం ఉందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గౌతమ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎర్రగుంటలో ఉన్న లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవల గురించి తెలుసుకుని అభినందించారు. కంటి వైద్య శిబిరాలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే, మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉందని సూచించారు. లయన్స్ క్లబ్‌కు కావాల్సిన మరిన్ని సదుపాయాలను త్వరలో అందిస్తామని హామీ ఇచ్చారు. లయన్స్ క్లబ్ సేవలకు యువత సహకారం అందించాలని కోరారు. అనంతరం గవర్నర్ గౌతమ్, క్యాబినెట్ కార్యదర్శి జనార్దన్‌లను లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వేణుగోపాలాచార్యులు, వ్యవస్థాపకులు వెంకటస్వామి, రత్నశేఖర్‌రెడ్డి, కార్యదర్శి నాగేంద్ర, పళ్లెం వేణుగోపాల్, ఉట్టి శివప్రసాద్, గోశే రాధాకృష్ణ, కుళ్లాయప్ప, నాగరాజు, రాజు, సీనియర్, జూనియర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జట్కా పుల్లర్స్ అసోసియేషన్ సమస్య పరిష్కార దిశగా చర్యలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం టౌన్ ఫ్రూట్స్ మార్కెట్‌లో దశాబ్దాలుగా నిలిచిపోయిన జట్కా పుల్లర్స్ అసోసియేషన్ సమస్య పరిష్కార దిశగా ఎట్టకేలకు చర్యలు ప్రారంభమయ్యాయని మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అసోసియేషన్‌కు సంబంధించి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం కాక అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వారు సమస్యలను వివరించగా వాటిని మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మంత్రి వెంటనే స్పందించి సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

ప్రజాశక్తి-పావగడ

నాణ్యమైన విద్య, ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని క్షేత్ర విద్యాశాఖాధికారి ఇంద్రాణమ్మ సూచించారు. పట్టణంలోని క్షేత్ర విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన పాఠశాలల పున:ప్రారంభోత్సవ జాతా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గురువారం నుంచి పాఠశాలలు పున్నప్రారంభం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు చిన్నారులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయం నుంచి శని మహాత్మ ఆలయం సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో 'రండి పిల్లలారా... ప్రభుత్వ పాఠశాలకు రండి..' అనే పాటతో పిల్లలకు స్వాగతం పలికారు. తాలూకాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను తోరణాలతో అలంకరించారు. విద్యార్థులకు పూలు, మిఠాయిలు పంపిణీ చేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బిఆర్‌సి వెంకటేష్, ఈసిఒ వేణుగోపాల్, ఎస్‌డిఎంసి అధ్యక్షుడు మల్లికార్జునప్ప, హెచ్ఎం శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు ఆనందప్ప, దుర్గమ్మ, ఆదర్శ విద్యాలయ ఎస్‌డిఎంసి అధ్యక్షుడు ప్రకాష్, ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు నాగరాజ్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రైతులకు వన్-బి, అడంగల్ వెంటనే మంజూరు చేయాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలో వివిధ బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు వన్-బి, అడంగళ్లు వెంటనే మంజూరు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ నారాయణస్వామికి అందజేశారు. రైతు సంఘం నాయకులు పెద్దన్న మాట్లాడుతూ బ్యాంకుల్లో తీసుకున్న వ్యవసాయ రుణాలను రైతులు రెన్యువల్ చేసుకుంటున్నారన్నారు. అయితే వన్-బి, అడంగల్ మంజూరులో జాప్యం కారణంగా రుణాల రెన్యువల్ విషయంలో రైతులకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు అవసరమయ్యే వన్-బి, అడంగళ్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వందలాది మంది రైతులు బ్యాంకుల్లో భూములను తాకట్టుపెట్టి రుణాలు తీసుకుని వాటిని రెన్యువల్ చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. అలాగే బ్యాంకు అధికారులు రుణాలను పెంచకుండా కేవలం రెన్యువల్ చేస్తున్నారని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతాంగం వడ్డీ కట్టలేని స్థితిలో ఉన్నారని, అలాంటప్పుడు ప్రభుత్వం, అధికారులు రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు, ఆవాజ్ కమిటీ నాయకులు పెద్దన్న, వెంకటేశు, బాబ్‌జాన్, కళాకారుడు బాబు, సభ్యులు చికెన్ రఫీ, రహీం, అల్లాబకాష్, బాబాఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

వీరజవాన్ క్రికెట్ టోర్నీ విజేత కోడూరు జట్టు

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని కోడూరు యూత్ ఆధ్వర్యంలో వీరజవాను మురళీనాయక్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. 50 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో కోడూరు, సోమఘట్ట జట్లు ఫైనల్‌కు చేరాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో కోడూరు జట్టు గెలవగా, సోమఘట్ట జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విజేత జట్లుకు రూ. 50వేలు, రన్నరప్ జట్టుకు రూ. 20వేల నగదు బహుమతులనుడిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్, ఎస్ఐ మునీర్‌అహ్మద్ అందజేశారు. అధికారులు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్ వంటి వీరుడు జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. యువతలో దేశభక్తిని కలిగించడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు జరపడం యువతను ప్రోత్సహించే దిశగా నడిపిస్తాయన్నారు. కోడూరు యూత్ సేవా భావం అభినందనీయమని కొనియాడారు. క్రీడాకారులకు తాగునీరు, భోజన సౌకర్యం కల్పించడంలో యూత్ పాత్ర ప్రశంసనీయం అన్నారు. కార్యక్రమంలో ఫిరంగి ప్రవీణ్ కుమార్, రామచంద్ర, అశోక్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

విన్నర్స్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అధికారులు

మహానాడులో తెలుగు తమ్ముళ్ల సందడి

ప్రజాశక్తి-కదిరి టౌన్

కడప నగరంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడుకు గురువారం జిల్లా వ్యాప్తంగా తెలుగుతమ్ముళ్లు వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. కదిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సుమారు 270 వాహనాల్లో తరలివెళ్లారు. వారికి మార్గ మధ్యలో వేంపల్లె వద్ద భోజనం ఏర్పాటు చేశారు.

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి నియోజకవర్గం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు మహానాడుకు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. నియోజకవర్గ వ్యాప్తంగా పంచాయతీలకు బస్సులు, వాహనాలు ఏర్పాటు చేయగా పార్టీ శ్రేణులు వాటిలో తరలివెళ్లారు. ౦ండలంలోని పెడపల్లి, కొట్లపల్లి, నిడిమామిడి, కప్పలబండ పంచాయతీల నుంచి పుట్టపర్తి ప్రశాంతి గ్రామం వార్డ్ మెంబర్ జయప్ప ఆధ్వర్యంలో గంగాద్రి, మారుతి, ఈ.శ్యామల, రాజప్ప, శంకరమ్మ, రమేష్, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పెడపల్లి మాజీ సర్పంచి శ్రీరామనాయక్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వాహనాలు తరలివెళ్లాయి.

ఎమ్మెల్యే కందికుంట ఆధ్వర్యంలో బయల్దేరిన టిడిపి శ్రేణులు

నల్లమాడ : పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి గారి ఆదేశాల మేరకు నల్లమాడ మండలం నుంచి టిడిపి శ్రేణులు కడపలో జరిగే మహానాడుకు భారీగా తరలి వెళ్లారు. వారిలో మండల కన్వీనర్ మైలే శంకర, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, మంజురెడ్డి, గుంద్ర శివారెడ్డి, గన్‌రెడ్డి, కెబి.మంజునాథరెడ్డి, మైలే రామ చంద్ర, ఎపి.కేశవరెడ్డి, శ్రీరాములు, భువనేశ్వర్‌రెడ్డి, నరసింహులు, అరవింద్‌బాబు, డి.హనుమంతరెడ్డి, పొరకల అభి, ఎం.రవికుమార్, ఎస్.పూలరామయ్య, ప్రతాపరెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

31న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

డిఆర్‌డిఎ పీడీ నరసయ్య

ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్

జూన్ 1వ తేదీ ఆదివారం అయినందున మే 31వ తేదీనే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తామని డిఆర్‌డిఎ పిడి నరసయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 2,61,517 మంది పింఛనుదారులకు 4,973 మంది సభ్యులతో రూ. 114.42 కోట్లు పంపిణీ చేస్తామన్నారు. సచివాలయాల సిబ్బంది మొదటి రోజే 90 శాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. రెండు రోజుల్లోపు పూర్తి కాకుంటే మిగిలిన మొత్తాన్ని సెర్ప్ కార్యాలయంలో చెల్లించాలన్నారు. 31న పంపిణీ చేసే విషయంపై గ్రామాల్లో ముందుగానే టామ్ టామ్ ద్వారా తెలపాలన్నారు.

పాఠశాల ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ఆర్డీవో, అధికారులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఆర్డీవో

ప్రజాశక్తి-కదిరి అర్బన్

యోగా ఉంటే ఆరోగ్యం మీ వెంట ఉన్నట్లేనని ఆర్డీవో వివిఎస్.శర్మ ప్రజలకు అవగాహన కల్పించారు. యోగాంధ్రలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఆర్డీవో అధ్యక్షతన నిర్వహిస్తున్న యోగా మాసో త్సవంలో భాగంగా గురువారం శిక్షకులు రామ్మూర్తి, శంకర్‌బాబు అధికారుల చేత యోగాస నాలు వేయించారు. ఆర్డీవో మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవంలో అధికారు లు, సిబ్బంది, ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. రోజూ ఉదయం 6 గంటలకు బాలికల పాఠశాలకు చేరుకోవాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందు రోజు పట్టణంలో యోగాపై పెద్ద ఎత్తున అవగా హన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో పట్టణ ప్రజలు, విద్యార్థులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపుని చ్చారు. యోగా మాసోత్స వాల్లో ఎంపీడీవో పోలప్ప, ఎంఇఒ ఓబుల్‌రెడ్డి, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్ చొరవతో బోరు వేయించిన అధికారులు

మంత్రి చొరవతో ప్రభుత్వ ఆసుపత్రికి నీటి సౌకర్యం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో(పిహెచ్‌సి)లో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య తీవ్రమైంది. దీంతో వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ఆసుపత్రి సిబ్బంది మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే పిహెచ్‌సి లో బోరు వేయించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు బోరు వేయించడంతో ఆసుపత్రిలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమైంది. మంత్రి చొరవ పట్ల వైద్య సిబ్బంది, రోగులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీసాయి యేసు పాఠశాలకు ఎన్‌సిసి యూనిట్

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని శ్రీసాయి యేసు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు ఎన్‌సిసి(నేషనల్ క్యాడెట్ కార్ప్స్) యూనిట్ ఆమోదం లభించింది. మండలంలో ఈ గుర్తింపు పొందిన తొలి ప్రయివేట్ పాఠశాలగా శ్రీసాయి యేసు పాఠశాల నిలిచింది. కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సిసి ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, విలువలు పెంపొందుతాయన్నారు. ఎన్‌సిసి యూనిట్ దక్కడం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళల జీవనోపాధికి కృషి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ఆర్‌డిటి ఫీల్డ్ ఆఫీసులో గురువారం ముక్తాపురంతండాకు చెందిన 54 మందికి ఉమెన్ టు ఉమెన్ కార్యక్రమం కింద వారి వ్యక్తిగత పొదుపు నుంచి జీవనోపాధి కార్యక్రమాల కోసం ఒక్కొక్కరికి సుమారు రూ. 52వేల చొప్పు మొత్తం రూ. 27,56,000 లబ్ధి పొందారు. కార్యక్రమంలో ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్, కౌన్సిలర్ పర్వీన్, సిఒలు రమణ, కీర్తి, ఆర్‌డిటి సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధి కోసం లబ్ధి పొందిన మహిళలు

విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి

ప్రజాశక్తి-పుట్లూరు

విద్యుత్ షాక్‌కు గురై యువ రైతు మృతి చెందిన సంఘటన పుట్లూరు మండల పరిధిలోని చాలవేముల గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... చాలవేముల గ్రామానికి చెందిన రాజకుళ్లాయప్ప(24) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం తన తోటలో ముళ్ల కంచెను శుభ్రం చేసేందుకు వెళ్లాడు. ముళ్ల కంచెను కట్టే సాయంతో తొలగిస్తుండగా కట్టెను అనుకోకుండా పైకి ఎత్తడంతో అక్కడ ఉన్న 11కెవి విద్యుత్ వైర్ తగిలింది. దీంతో షాక్‌కు గురై రాజకుళ్లాయప్ప అక్కడికక్కడే మరణించాడు. తోటి రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.



రాజకుళ్లాయప్ప(ఫైల్‌ఫోటో)

నేరాలు ఘోరాలు

విదేశీయుడిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అధిక లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పి విదేశీయుడిని నమ్మించి భూముల కొనుగోలు పేరుతో రూ. 12.5 కోట్లు మోసం చేసిన ఘరానా మోసగాడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. డీఎస్పీ గురువారం విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని రత్నాకరం సత్యనారాయణ అమెరికాకు చెందిన ఆర్విన్ ఫ్రాన్సిస్ మహేంద్ర కారల్ అనే వ్యక్తిని పరిచయం చేసుకుని ఇక్కడ భూములు కొంటే అధిక లాభాలు గడించవచ్చని నమ్మించాడన్నారు. తరచూ సత్యసాయి దర్శనానికి వచ్చే ఆ విదేశీయుడు ఇతడి మాటలు నమ్మి సుమారు రూ. 12.5 కోట్లతో తన పేరు మీద ప్లాట్లు, భూములు కొన్నాడన్నారు. ఆ ఆస్తుల గురించి విదేశీయుడు సత్యనారాయణను అడగ్గా నీకేం సంబంధం లేదు, ఆస్తులు అన్నీ నా పేరుతో ఉన్నాయి, నువ్వు నాకేమీ ఇవ్వలేదని బుకాయించాడన్నారు. ఆ సొమ్ముతో సత్యనారాయణ క్రికెట్ బెట్టింగ్ ఆడడానికి, జల్సాలకు ఖర్చు చేశాడన్నారు. తనకు జరిగిన మోసంపై విదేశీయుడు పోలీసులను ఆశ్రయించాడు. అతడి ఫిర్యాదు మేరకు బుధవారం సాయంత్రం స్థానిక ఉజ్వల అపార్ట్‌మెంట్ సమీపంలో నిందితుడు సత్యనారాయణను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంపై ఎస్పీ వి.రత్న పట్టణ పోలీసులను అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

రాళ్లను ఢీకొన్న కారు.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-తాడిమర్రి

మండల పరిధిలోని కొండమనాయనిపాలెం వద్ద గురువారం బ్రేకులు ఫెయిల్ కావడంతో ఓ కారు రోడ్డు పక్కనే ఉన్న రాళ్లను ఢీకొంది. వివరాలు.. కర్నాటక రాజధాని బెంగళూరుకు చెందిన వ్యక్తులు కారులో గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా కొండమనాయనిపాలెం వద్ద బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో డ్రైవర్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న రాళ్ల కుప్పను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం జరగపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వాహనం ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది.

ప్రమాదానికి గురైన కారు